ప్రతి అక్షరం ప్రజాహితం

RNI No: APTEL -2023/89112 www.andhrapragathi.com

# నేటి ఆంధ్రప్రగతి

తెలుగు దినపత్రిక

సంపుటి - 02 సంచిక -75 పేజీలు - 04 వెల - 04/- బుధవారం 25 డిసెంబర్ 2024

## ఎన్నికల ప్రక్రియ నిబంధనల్లో మార్పులు

### సుప్రీంలో సవాల్ చేసిన కాంగ్రెస్



న్యూఢిల్లీ,డిసెంబర్ 24ఆంధ్రప్రగతి: ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన నిబంధనల్లో మార్పులు చేయడాన్ని కాంగ్రెస్ తప్పుపట్టింది. దీన్ని సుప్రీంకోర్టులో సవాల్ చేసింది. ప్రస్తుత చర్యల కారణంగా ఎన్నికల ప్రక్రియ సమగ్రతకు భంగం కలుగుతుందని పిటిషన్‌లో పేర్కొంది. ఎన్నికల సంఘం ఇటీవల చేసిన సవరణలను సవాల్ చేస్తూ రిట్ పిటిషన్ దాఖలు చేసింది. ఎన్నికలకు సంబంధించిన రికార్డులను ఎవరైనా తనిఖీ చేసేందుకు అనుమతించే నిబంధనల్లో కేంద్ర ఎన్నికల సంఘం మార్పులు చేసింది. పోలింగ్‌కు సంబంధించిన సీసీటీవీ ఫుటేజ్‌ను, వెబ్ కాస్టింగ్ రికార్డులను, అభ్యర్థులకు చెందిన వీడియో రికార్డులను తనిఖీ చేయకుండా ఎన్నికల సంఘం నిషేధం విధించింది. ఎన్నికల సంఘం సిఫార్సు మేరకు ఎన్నికల నిర్వహణ నిబంధనలు-1961లోని రూల్ 93(2)(ఏ)ను కేంద్ర న్యాయశాఖ సవరించింది. స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా ఎన్నికలు నిర్వహించాల్సిన కేంద్ర ఎన్నికల సంఘం.. ఏకపక్షంగా ఎన్నికల ప్రక్రియ నిబంధనల్లో మార్పులు చేయడాన్ని సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేసినట్లు ఏఐసీసీ జనరల్ సెక్రటరీ జైరాం రమేష్ తెలిపారు. ఇటీవల జరిగిన మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ఓట్లను ఏకపక్షంగా తొలగించడం లేదా చేర్చడం వంటి చర్యలకు పాల్పడలేదని కేంద్ర ఎన్నికల సంఘం కాంగ్రెస్‌కు తెలిపింది.

## చదువుకున్న మహిళలకు

# వర్క్ ఫ్రమ్ హోమ్

- గ్రామీణ, జిల్లా స్థాయిలో ఉత్పాదకత పెంచే లక్ష్యం
- వర్క్ ఫ్రం హోమ్, కో-వర్కింగ్ సెంటర్‌లతో మహిళలకు అవకాశం
- గృహిణులుగా మిగిలి పోకుండా మహిళలకు ఉపాధి అవకాశాలు
- సమీక్షలో చంద్రబాబు కీలక నిర్ణయం





అమరావతి,డిసెంబర్ 24ఆంధ్రప్రగతి: గ్రామీణ, జిల్లా స్థాయిలో ఉత్పాదకత పెంచడం, వ్యాపార, ఉపాధి అవకాశాలు పెంచడం కోసం కొన్ని ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకోనుంది. ఇందులో భాగంగా ఒకే చోట కలిసి పని చేసే విధానాన్ని అందుబాటులోకి తెచ్చే ప్రయత్నం జరుగుతోంది. రాష్ట్రంలో కో-వర్కింగ్ స్పేస్, నైబర్ హుడ్ వర్కింగ్ స్పేస్ అభివృద్ధిపై ప్రభుత్వం కొన్ని కీలక నిర్ణయాలు తీసుకోనుంది. కో వర్కింగ్‌కు సంబంధించి సీఎం చంద్రబాబు మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో, చిన్న పట్టణాల్లో ఉన్న వారికి ట్రైనింగ్ ఇచ్చి వారికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని, అలాంటి వారి కోసం వర్కింగ్ స్పేస్ క్రియేట్ చేయాలని సీఎం చంద్రబాబు అధికారులకు సూచించారు.

మిగతాది 2లో...

## కూటమి ప్రభుత్వం ఏం సాధించిందని కార్పొరేటర్లు టీడీపీలోకి వెళుతున్నారు?

### : కడప కార్పొరేటర్లతో జగన్

ఏ సమస్య వచ్చినా తాను అండగా ఉంటానని భరోసా

భవిష్యత్తులో మనందరికీ మంచి రోజులు వస్తాయని వ్యాఖ్య



2లో

## వర్సిటీల ప్రక్షాళనకు

# శ్రీకారం

- వర్సిటీలకు వీసీల నియామకంపై దృష్టి సారించిన మంత్రి నారా లోకేశ్
- గత ప్రభుత్వ హయాంలో రాజకీయ పునరావాస కేంద్రాలుగా మారాయంటూ విమర్శలు
- కీలక సంస్కరణలకు కృషి



అమరావతి,డిసెంబర్ 24ఆంధ్రప్రగతి: గత ప్రభుత్వ హయాంలో రాజకీయ పునరావాస కేంద్రాలుగా తయారైనట్టు ఆరోపణలు ఎదుర్కొంటున్న యూనివర్సిటీలను సరస్వతీ నిలయాలుగా మార్చేందుకు కృషి చేస్తున్నామని ఏపీ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ పలు సందర్భాల్లో చెప్పారు. ఈ మేరకు అనేక కీలక సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా రాజకీయాలకు అతీతంగా రాష్ట్రంలోని 17 విశ్వవిద్యాలయాల్లో ఉన్నత విద్యావంతులను వైస్-చాన్స్ లర్లుగా నియమించేందుకు నోటిఫికేషన్లు ఇచ్చి, సెర్చి కమిటీలను ఏర్పాటు చేశారు. అంతేకాదు, సమర్థ్ యూనివర్సిటీ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌ను అన్ని యూనివర్సిటీల్లో అమలు చేసేలా ఆదేశాలిచ్చారు. మిగతాది 2లో...

## అక్రమంగా నియమితులైన 410 మంది ఉద్యోగులను తొలగిస్తున్నాం

- గడువులోగా డబ్బు చెల్లించకపోతే రామ్ గోపాల్ వర్మపై కేసు పెడతాం: జీవీ రెడ్డి
- ఏపీ ఫైబర్ నెట్ ప్రస్తుత చైర్మన్ జీవీ రెడ్డి మీడియా సమావేశం
- గత ప్రభుత్వ హయాంలో ఫైబర్ నెట్ లో అక్రమాలు జరిగాయన్న జీవీ రెడ్డి



2లో

## పూంచ్ సెక్టార్లో ఘోర ప్రమాదం

### జమ్ము కశ్మీర్ లో 150 అడుగుల లోయలో పడిన వాహనం... ఐదుగురు జవాన్ల మృతి

- నీలమ్ నుంచి బల్నోయి ఘోరా పోస్ట్ వద్దకు వెళుతున్న సైనికులు
- వాహనం అదుపుతప్పి లోయలో పడిపోయిన వైనం
- మృతులు నెంబర్ 11 మరాఠా లైట్ ఇన్ ఫాంట్రీ రెజిమెంట్ కు చెందినవారు



కశ్మీర్ /డిసెంబర్ 24ఆంధ్రప్రగతి: జమ్ము కశ్మీర్ లో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. పూంఛ్ లో ఓ సైనిక వాహనం 150 అడుగుల లోయలో పడిపోయింది. ఈ ఘటనలో ఐదుగురు జవాన్లు మృత్యువాత పడ్డారు. మరో 8 మంది సైనికులు గాయపడ్డారు. మృతి చెందిన జవాన్లు నెంబర్ 11 మరాఠా లైట్ ఇన్ ఫాంట్రీ రెజిమెంట్ కు చెందినవారు. వీరంతా క్విక్ రియాక్షన్ టీమ్ లో సభ్యులు. సైనిక వాహనం నియంత్రణ రేఖ వెంబడి ప్రయాణిస్తుండగా, పూంఛ్ సెక్టార్లో ఈ ప్రమాదం జరిగింది. సైనికులు నీలమ్ ప్రాంతంలో ఉన్న స్థావరం నుంచి బల్నోయి ఘోరా పోస్ట్ వద్దకు వెళుతుండగా, వారు ప్రయాణిస్తున్న వాహనం ఒక్కసారిగా అదుపుతప్పి లోయలో పడిపోయిందని స్థానిక పోలీసులు తెలిపారు. ఘటన జరిగిన వెంటనే సైన్యం, పోలీసులు సహాయచర్యలు ప్రారంభించారు.

## దేశవ్యాప్తంగా టీటీడీ కార్యక్రమాల నిర్వహణకు కమిటీ

- స్విమ్స్ హస్పిటల్‌కి జాతీయ హోదా కోసం కేంద్రానికి వినతి
- భక్తులకు దర్శనం, వసతి సౌకర్యాల్లో ఇబ్బంది లేకుండా చర్యలు
- తిరుమలలో ఫుడ్ సేఫ్టీ విభాగం ఏర్పాటుకు నిర్ణయం
- అన్నప్రసాద తయారీ కేంద్రంలో అదనంగా 258 మంది సిబ్బంది
- కంచి పీఠం పాఠశాల నిర్వహణకు రూ. 2 కోట్లు కేటాయింపు
- ఒంటిమిట్ట రామాలయంలో బంగారు కలశం ఏర్పాటు
- తిరుమల అభివృద్ధిపై టీటీడీ పాలకమండలి కీలక నిర్ణయాలు
- వివరాలు వెల్లడించిన టీటీడీ ఈవో శ్యామలరావు



తిరుమలడిసెంబర్ 24ఆంధ్రప్రగతి: : తిరుమల అభివృద్ధిపై టీటీడీ పాలకమండలి కీలక నిర్ణయాలు తీసుకుంది. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు దేశవ్యాప్తంగా టీటీడీ కార్యక్రమాలు నిర్వహించడానికి కమిటీ ఏర్పాటు చేసిందని టీటీడీ ఈవో శ్యామలరావు తెలిపారు. దేశంలోని ప్రతి రాష్ట్ర రాజధానిలో టీటీడీ ఆలయాలు నిర్మిస్తామని చెప్పారు. స్విమ్స్ హస్పిటల్‌కి జాతీయ హోదా కల్పించాలని కేంద్రానికి విజ్ఞప్తి చేస్తామని అన్నారు. తిరుమల పర్యటనలో భక్తుల ఆరోగ్య సమస్యలు గుర్తించి సేవలు అందించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. తిరుమలలో తక్కువ ధరకే నాణ్యమైన ఆహారం అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తితిదే ఈవో శ్యామలరావు తెలిపారు. మిగతాది 2లో...

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక



# దేశవ్యాప్తంగా క్రిస్మస్ శోభ

## పండగలో క్రిస్మస్ ట్రీకి ప్రత్యేకత ఒక్కో దేశంలో ఒక్కోలా పండగ నిర్వహణ

విజయవాడ,డిసెంబర్ 24ఆంధ్రప్రగతి:
క్రిస్మస్ పండుగ రానే వచ్చింది. దేశంతో పాటు ప్రపంచవ్యాప్తంగా క్రిస్మస్ శోభ కనినిస్తోంది. మిగతా పండుగలకన్నా క్రిస్మస్ కాస్త ప్రత్యేకం. ఎందుకంటే క్రిస్మస్ వేడుకలను కచ్చితంగా ఇలానే జరుపుకోవాలనే నియమాలేమీ ఉండవు. కొన్ని దేశాల్లో క్రిస్మస్‌కు పదిపదిహేను రోజుల ముందు నుంచే వేడుకలు మొదలైతే, కొన్ని దేశాలు పండుగ తర్వాత కూడా అందరిలో ఆ ఆనందాల్ని నింపుతాయి. ఈ పండుగలో ప్రధానంగా కనిపించేది క్రిస్మస్ ట్రీ. ప్రతీ ఇంట్లో క్రిస్మస్ ట్రీని రకరకాలుగా అలంకరించి, దీపాల వెలుగులతో నింపేస్తుంటారు. అయితే క్రిస్మస్ ట్రీ అన్నిచోట్ల ఒకేలా ఉండదు. ఒక్కో దేశంలో ఒక్కో ప్రత్యేకతతో ఉంటుంది. అంతేకాదు, కొన్ని దేశాల్లో ట్రీ తోపాటు క్రిస్మస్ జరుపుకునే విధానం కూడా వేరేగా ఉంటుంది. ఐర్లాండ్‌లో పిల్లలు క్రిస్మస్‌ను వేరే తీరులో జరుపుకుంటారు. ప్రతిరోజూ రాత్రి పడుకోబోయే ముందు తమ పడక గది కిటికీ పక్కన షూ పెట్టి నిద్రపోతారు. మర్నాడు ఆ ప్రదేశంలో వారికి ఒక క్రిస్మస్ గిఫ్ట్ ఉంటుందని నమ్ముతారు. ఆ గిఫ్ట్ సైజు అంతకుముందురోజు పిల్లల ప్రవర్తన బట్టి ఉంటుందట. ఇక్కడ క్రిస్మస్ ట్రీని 'ఉలే లాడ్స్' అనే క్రిస్మస్ తాత ఆకారంలో ఉండే బొమ్మలతో, గుండ్రటి బంతులతో అలంకరిస్తారు. ఇటలీలో శాంటాక్లాజ్ కోసం పిల్లలు ఎదురుచూడరు. దానికి బదులు జనవరి 5న 'లా బెఫానా', 'క్రిస్మస్ విచ్' రాక కోసం ఎదురుచూస్తారు. ఇక్కడ క్రిస్మస్ ట్రీని వాళ్లే తయారు చేసిన చిన్నచిన్న బొమ్మలు, క్రాఫ్ట్‌తో అలంకరిస్తారు. ఇక ఆస్ట్రేలియాలో సముద్రపు గవ్వలు, ఫ్రాన్స్‌లో ఫ్రూట్స్, జర్మనీలో కొవ్వొత్తులు, నెదర్లాండ్స్ బిస్కట్స్ ఇలా ప్రపంచ దేశాలన్నీ క్రిస్మస్‌ను తమ సంప్రదాయాలు, జీవనశైలికి అనుగుణంగా రకరకాలుగా జరుపు కుంటాయి. ఇక్కడ కూడా కూడా క్యాండీ స్టిక్స్, స్టార్స్, చా÷-లకెట్స్, కలర్ రిబ్బన్స్ ఉపయోగించి క్రిస్మస్ ట్రీసు రకరకాలుగా అలంకరించుకోవచ్చు. క్రిస్మస్ అమెరికాలో ముఖ్యమైన పండుగ.రెండు వారాల ముందు నుంచే క్రిస్మస్ సందడి ప్రారంభమవుతుంది. అక్కడ క్రిస్మస్ ట్రీ అలంకరణకు ఎంతో ప్రాధాన్య మిస్తారు. వాళ్లు ముఖ్యంగా పాప్ కార్న్?ని క్రిస్మస్ ట్రీ అలంకరణకు వాడతారు. పూలమాల లాగా పాప్ కార్న్‌ని దారానికి అల్లి దానిని క్రిస్మస్ చెట్టుకి చుడతారు. ట్రీ చుట్టూ రంగు రంగుల లైట్లు అమర్చి వెలుగులతో మెరిసిపోయేలా తయారు చేస్తారు. జపాన్‌లో అయితే క్రిస్మస్‌కు హాలిడే కూడా ఉండదు. అయినా.. అక్కడివాళ్లందరు ఈ పండుగను ఎంతో



సరదాగా జరుపుకుంటారు. వీళ్లు క్రిస్మ స్ ట్రీకి అలంకరణగా ఓరిగామి బర్డ్స్ ని వాడతారు. ఈ బర్డ్స్ ని పేపర్‌తో తయారుచేస్తారు. బుల్లి పిట్టల్లాగా ఉండే ఈ బర్డ్స్ ని ఇంట్లోనే తయారు చేస్కోవచ్చు. ఉక్రెయిన్‌లో క్రిస్మస్ వేడుకల్లో అలంకరణ జోష్ బాగా ఉంటుంది. అవి అమెరికాలో జరుపుకునే హాలోవీన్ అలంకరణకు దగ్గరగా ఉంటాయి. అంతేకాదు. క్రిస్మస్ ట్రీలను సాలెగూళ్లతో ఎంతో అందంగా అలంకరిస్తారు. ఇవి మిగతా క్రిస్మస్ ట్రీస్ కన్నా చాలా భిన్నంగా ఉంటాయి. సాలెగూళ్లతో అలంకరించే సంప్రదాయానికి అక్కడి జానపద కథ కారణమని చెబుతారు.

# దేశవ్యాప్తంగా టీటీడీ కార్యక్రమాల నిర్వహణకు కమిటీ

(మొదటి పేజి తరువాయి)
తిరుమలలోని అన్నమయ్య భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. భక్తుల సంఖ్య భారీగా పెరగడంతో అన్నప్రసాద తయారీ కేంద్రంలో ప్రస్తుతం ఉన్న సిబ్బంది సరిపోవడం లేదని, తగినంత సిబ్బందిని నియమిస్తామని తెలిపారు. తిరుమలలో ఫుడ్ సేఫ్టీ విభాగాన్ని ఏర్పాటు చేయాలని బోర్డు సమావేశంలో నిర్ణయించినట్టు ఈవో చెప్పారు. తిరుమలకు వచ్చే భక్తుల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని పరిష్కరించేందుకు వీలుగా ఫీడ్‌బ్యాక్ వ్యవస్థ ఏర్పాటు చేస్తున్నట్టు వెల్లడించారు. భక్తులకు అందించే సేవలపై ఫీడ్‌బ్యాక్‌ను ఏపీ డిజిటల్ సహకారంతో స్వీకరించేందుకు నిర్ణయం తీసుకున్నట్లు టీటీడీ ఈవో శ్యామలరావు చెప్పారు. తిరుమలలో ఉన్న హోటల్స్ టెండర్ల కేటాయింపులో మార్పులు చేస్తున్నామని అన్నారు. అన్నప్రసాదంలో అదనంగా 258 మంది సిబ్బందిని నియమిస్తున్నట్లు ప్రకటించారు..కంచి కామకోటి పీఠం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న



సంప్రదాయ పాఠశాల నిర్వహణకు రూ. 2 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. తిరుమలలో నూతనంగా ఫుడ్ సేఫ్టీ విభాగాన్ని నియమించాలని నిర్ణయం తీసుకున్నామన్నారు. భక్తులు సౌకర్యార్థం క్యూ కాంప్లెక్స్ వద్ద రూ.3.6 కోట్లతో టాయిలెట్స్ నిర్మిస్తున్నట్లు చెప్పారు. ఒంటిమిట్ట రామాలయంలో రూ. 42 లక్షలతో బంగారు కలశం ఏర్పాటు చేస్తున్నట్లు ఈవో శ్యామలరావు తెలిపారు. తిరుమల..శారదా పీఠానికి కేటాయించిన మఠం లీజు రద్దు చేయడానికి నోటీసులు జారీ చేశామని అన్నారు. మఠం నిర్వాహకులు ఇచ్చే సమాధానం మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామని టీటీడీ ఈవో శ్యామలరావు తెలిపారు. తిరుమల పర్యటనలో భక్తుల ఆరోగ్య సమస్యలు గుర్తించి సేవలు అందించేందుకు ఏర్పాట్లు చేస్తామని పేర్కొన్నారు. దర్శనం, వసతి సౌకర్యాల్లో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తామన్నారు. తిరుమలలోని అన్నమయ్య భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. భక్తులకు అందించే సేవలపై, వారి సమస్యలను తెలుసుకునేందుకు ఫీడ్ బ్యాక్ వ్యవస్థ ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. తిరుమలలో వున్న హోటల్స్ టెండర్ల కేటాయింపులో మార్పులు చేస్తామని తెలిపారు. తిరుమలకు వచ్చే భక్తుల సంఖ్య భారీగా పెరగడంతో అన్నప్రసాద తయారీ కేంద్రంలో ప్రస్తుతం ఉన్న సిబ్బంది సరిపోవడం లేదని.. అన్నప్రసాద తయారీ కేంద్రంలో అదనంగా 258 మంది సిబ్బందిని నియమిస్తామని టీటీడీ ఈవో తెలిపారు. మీడియా సమావేశంలో ఛైర్మన్ బిఆర్ నాయుడు కూడా పాల్గొన్నారు.

# పేర్ని నాని పిటిషన్‌పై హైకోర్టు అభ్యంతరం

అమరావతిడిసెంబర్ 24ఆంధ్రప్రగతి:
గోడౌన్ నుంచి రేషన్ బియ్యం మాయం చేసిన వ్యవహారంలో మాజీ మంత్రి పేర్ని నాని , ఆయన కుమారుడు కిట్టు వేసిన పిటిషన్లపై ఏపీ హైకోర్ట్‌లో మంగళవారం విచారణ జరిగింది. విచారణకు హాజరుకావాలంటూ మచిలీపట్నం పోలీసులు ఇచ్చిన నోటీసులను సవాల్ చేస్తూ పేర్నినాని, ఆయన కుమారుడు పేర్ని కృష్ణమూర్తి దాఖలు చేసిన పిటిషన్‌పై ధర్మాసనం విచారించింది. అయితే ఈ నెల 22న విచారణకు హాజరుకావాలని పోలీసులు నోటీసులు ఇచ్చారని న్యాయమూర్తి గుర్తుచేశారు. గడువు ముగిసిన నేపథ్యంలో పిటిషన్ విచారణపై న్యాయమూర్తి అభ్యంతరం వ్యక్తం చేశారు. వ్యాజ్యం ఉపసంహరణకు అనుమతి ఇవ్వాలని, తిరిగి పోలీసులు నోటీసులు ఇస్తే కోర్టును ఆశ్రయించేందుకు వెసులుబాటు ఇవ్వాలని న్యాయస్థానాన్ని న్యాయవాదులు అభ్యర్థించారు. అందుకు న్యాయమూర్తి అంగీకారం తెలిపారు. మచిలీపట్నంలో వైసీపీ నేత పేర్నినాని సతీమణి జయసుధ మచిలీపట్నంలోని తన గోడౌన్‌ను పౌరసరఫరాలశాఖకు లీజుకిచ్చారు. అయితే ఇందులో నిల్వ చేసిన రేషన్ బియ్యం మాయం అయ్యాయని పేర్కొంటూ చింతం కోటిరెడ్డి అనే అధికారి ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా జయసుధపై పోలీసులు కేసు నమోదు చేశారు. మరోవైపు రేషన్



బియ్యం మాయం కేసులో పేర్ని నాని సతీమణి జయసుధ బెయిల్ పిటిషన్ మరోసారి వాయిదా పడింది. పీపీ సెలవులో ఉండటంతో మరోసారి బెయిల్ పిటీషన్‌ను న్యాయమూర్తి ఈనెల 27కు వాయిదా వేశారు. ఈరోజు ప్రాసిక్యూషన్ తరపున కౌంటర్ దాఖలు చేయాల్సి ఉండగా స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ విజయ సెలవు పెట్టారు. స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ హాజరుకాకపోవటంతో పిటిషన్‌ను న్యాయమూర్తి ఈనెల 27కు వాయిదా వేశారు. అలాగే కౌంటర్ దాఖలు విషయంలో పోలీసుల తీరుపై కూడా జడ్జి అసహనం వ్యక్తం చేశారు. పేర్నినాని సతీమణి జయసుధ బెయిల్ పిటిషన్‌పై వాయిదా పడటం ఇది నాలుగోసారి. కాగా.. కృష్ణా జిల్లా మచిలీపట్నం మండలం పొట్లపాలెంలో పేర్ని నాని సతీమణి జయసుధ పేరిట ఉన్న గోదాముల్లో రేషన్ బియ్యం మాయమైన సంగతి తెలిసిందే. ఈ ఏడాది మార్చి, ఏప్రిల్‌లో సుమారు 187 టన్నుల పీడీఎస్ బియ్యం అక్రమంగా తరలించినట్టు వెలుగులోకి వచ్చింది. ఈ కేసుకు బయటకు వచ్చినప్పటి నుంచి పేర్నినాని కుటుంబం అజ్ఞాతంలోకి వెళ్లిపోయింది. గత పది రోజులుగా పేర్ని నాని సతీమణి జయసుధ అజ్ఞాతంలో ఉన్నారు. కొద్దిరోజుల క్రితం పేర్నినాని బయటకు వచ్చి హైకోర్టును ఆశ్రయించారు. ముందస్తు బెయిల్ మంజూరు చేయాల్సిందిగా హైకోర్టులో పిటిషన్ వేశారు. బెయిల్‌పై క్లారిటీ వచ్చే వరకు పేర్నినాని సతీమణిని బయటకు వచ్చే అవకాశం లేదని తెలుస్తోంది. మరోవైపు పేర్నినాని భార్యపై పోలీసులు లుక్ అవుట్ నోటీసులు జారీ చేశారు. అలాగే ఇటీవల పేర్నినాని కుటుంబానికి పోలీసులు నోటీసులు ఇచ్చారు. విచారణకు సహకరించాల్సిందిగా పేర్నినాని ఇంటికి వెళ్లి పోలీసులు నోటీసులు ఇచ్చారు. అయితే పేర్నినాని ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ఇంటి గోడకు నోటీసులను అంటించారు. నోటీసులను పేర్నినాని చూడకపోవడంతో మరోసారి నోటీసులు ఇస్తామని పోలీసులు చెబుతున్నారు.

# వర్సిటీల ప్రక్షాళనకు శ్రీకారం

రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్ మెరుగుదలకు వ్యూహాత్మక ఫ్రేమ్‌వర్క్, మెంటర్‌షిప్ కమిటీలు ఏర్పాటుచేశారు. సమగ్ర పరీక్షల నిర్వహణ వ్యవస్థ ద్వారా పరీక్ష ప్రక్రియల ఆటోమేషన్ కోసం దశలవారీ ప్రణాళిక రూపొందించారు. మెరుగైన యూనివర్సిటీ మేనేజ్ మెంట్ సిస్టమ్ అమలుకోసం డిల్లీ యూనివర్సిటీతో ఒప్పందం కుదుర్చుకున్నారు. దీంతోపాటు ఈ-సమర్థ్ వ్యవస్థ ఇప్పటికే రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీల్లో పురోగతిలో ఉంది.
రాష్ట్రంలో ప్రస్తుతం 22% కళాశాలలు న్యాక్ గుర్తింపు పొందగా, 2028 నాటికి నూరుశాతం %చీూూజ% అక్రిడిటేషన్ సాధించేందుకు చురుకైన ప్రయత్నాలు జరుగుతున్నాయి. మూడు కొత్త కాలేజిలతో సహా 22 ప్రభుత్వ కళాశాలలకు స్వయంప్రతిపత్తి హోదా కల్పించారు.

# దయా గుణాన్ని ఇతరులకు పంచడమే క్రీస్తు సందేశం.!

### -క్రైస్తవ సోదరులకు క్రిస్మస్ శుభాకాంక్షలు
### -రాష్ట్ర న్యాయ మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్.



ఆంధ్ర ప్రగతి అమరావతి డిసెంబర్ 24:
దయా గుణాన్ని ఇతరులకు పంచడమే ఏసుక్రీస్తు సందేశమని రాష్ట్ర న్యాయ మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ పేర్కొన్నారు.క్రిస్మస్ పండుగ ప్రతీ ఒక్కరి ఇంటిలోనూ సంతోషాలు నింపాలని క్రిస్మస్ పండగ సందర్భంగా క్రైస్తవ సోదరులకు శుభాకాంక్షలు తెలుపుతూ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు.ప్రేమ, త్యాగానికి ప్రతీకైన యేసుక్రీస్తు బోధనలు ప్రతీ ఒక్కరికీ అనుసరణీయమన్నారు. ప్రేమ, శాంతి, దయాగుణాన్ని ప్రపంచానికి చాటిచెప్పిన గొప్ప వ్యక్తి 'యేసుక్రీస్తు' అని ప్రతీ ఒక్కరూ ప్రేమ, దయాగుణాన్ని కలిగి ఉండాలన్నారు. ప్రేమ, దయాగుణాన్ని ఇతరులకు పంచాలని క్రీస్తు ప్రజలకు బోధించడమే కాక, జీవించి చూపించారన్నారు. క్రైస్తవ సోదర, సోదరీమణులందరూ క్రిస్మస్ వేడుకలను ఆనందోత్సాహాల మధ్య సంతోషంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు.

# కూటమి ప్రభుత్వం ఏం సాధించిందని కార్పొరేటర్లు టీడీపీలోకి వెళుతున్నారు?

### : కడప కార్పొరేటర్లతో జగన్

కడప డిసెంబర్ 24ఆంధ్రప్రగతి:
వైసీపీకి చెందిన కడప మున్సిపల్ కార్పొరేటర్లతో ఆ పార్టీ అధినేత జగన్ ఈరోజు ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఇడుపులపాయలో జరిగిన ఈ సమావేశంలో జగన్ మాట్లాడుతూ... ఇటీవల పార్టీ మారిన కార్పొరేటర్లను వారి విజ్ఞతకే వదిలేద్దామని చెప్పారు. కూటమి ప్రభుత్వం ఏం సాధించిందని కార్పొరేటర్లు టీడీపీలోకి వెళుతున్నారని ప్రశ్నించారు. ఏ సమస్య వచ్చినా తాను అండగా ఉంటానని... సమస్యలు ఉంటే కడప ఎంపీ వైఎస్ అవినాశ్ రెడ్డి దృష్టికి తీసుకురావాలని సూచించారు. గతంలో తాను కూడా 16 నెలలు జైల్లో ఉన్నానని... తన బెయిల్ కోసం తన భార్య ఎంతో ఇబ్బంది పడిందని జగన్ చెప్పారు. తాను పడ్డ బాధలు ఈ ప్రపంచంలో ఇంకెవరూ పడి ఉండరని అన్నారు. ఎవరూ పార్టీ మారాల్సిన అవసరం లేదని... తాను మళ్లీ సీఎం అయితే మీ ఇంట్లో కుటుంబ సభ్యుడు సీఎం అయినట్టేనని చెప్పారు. భవిష్యత్తులో మనందరికీ మంచి రోజులు వస్తాయని తెలిపారు. ఆ తర్వాత కార్పొరేటర్లతో వేర్వేరుగా మాట్లాడారు.

# అక్రమంగా నియమితులైన 410 మంది ఉద్యోగులను తొలగిస్తున్నాం

### ఏపీ ఫైబర్ నెట్ ప్రస్తుత చైర్మన్ జీవీ రెడ్డి మీడియా సమావేశం
### గత ప్రభుత్వ హయాంలో ఫైబర్ నెట్ లో అక్రమాలు జరిగాయన్న జీవీ రెడ్డి

అమరావతి,డిసెంబర్ 24ఆంధ్రప్రగతి:
ఏపీ ఫైబర్ నెట్ చైర్మన్ జీవీ రెడ్డి మీడియాతో మాట్లాడారు. ఏపీ ఫైబర్ నెట్ లో గత ప్రభుత్వం అక్రమాలకు పాల్పడిందని అన్నారు. ఫైబర్ నెట్ నుంచి దర్శకుడు రామ్ గోపాల్ వర్మకు అక్రమంగా రూ.1.15 కోట్లు చెల్లించారని తెలిపారు. ఆ డబ్బు తిరిగి ఇచ్చేందుకు 15 రోజుల గడువుతో రామ్ గోపాల్ వర్మకు నోటీసులు కూడా ఇచ్చామని వెల్లడించారు. గడువులోగా డబ్బు చెల్లించకపోతే వర్మపై కేసు పెడతామని స్పష్టం చేశారు. ఫైబర్ నెట్ లో కోట్ల రూపాయల మేర నిధులు దుర్వినియోగం చేశారని జీవీ రెడ్డి తెలిపారు. గత సర్కారు ఏపీఎస్ఎఫ్ఎల్ కు రూ.12 కోట్ల అప్పుతో పాటు, రూ.900 కోట్ల బకాయి పెట్టిందని వెల్లడించారు. ఇక, గత ప్రభుత్వ హయాంలో అర్హత లేని ఫైబర్ నెట్ లో అక్రమంగా నియమించారని జీవీ రెడ్డి ఆరోపించారు. కొందరు ఫైబర్ నెట్ లో అక్రమంగా నియమితులయ్యారని, వారు వైసీపీ నేతల ఇళ్లలో పనులు చేశారని వివరించారు. అక్రమంగా నియమితులైన 410 మంది ఉద్యోగులను తొలగిస్తున్నామని ప్రకటించారు. అక్రమంగా ఉద్యోగులను నియమించిన వారికి లీగల్ నోటీసులు పంపుతామని, ఎక్కువగా మాట్లాడితే వేతనాల రికవరీ సహా కేసులు కూడా పెడతామని జీవీ రెడ్డి హెచ్చరించారు.

# చదువుకున్న మహిళలకు వర్క్‌ఫ్రమ్ హోమ్

(మొదటి పేజి తరువాయి)
చదువుకున్న మహిళలు గృహిణులుగా మిగిలిపోకూడదని, వారికి అవకాశాలు కల్పించాలని సీఎం అభిప్రాయపడ్డారు. వర్క్ ఫ్రం హోమ్, కో-వర్కింగ్ సెంటర్‌లతో మహిళలకు విస్తృతంగా అవకాశాలు లభిస్తాయి. మహిళలను ఇంటికి, ఇంటి పనికి పరిమితం చేయడం సరికాదని సీఎం అన్నారు. ఇప్పటికీ చదువుకున్న మహిళలు ఇళ్లల్లో ఉంటున్నారని.. వారికి వర్క్ ఫ్రం హోమ్ అందుబాటులోకి తెస్తే ఆన్‌లైన్ విధానంలో పనిచేసి ఉపాధి పొందుతారని ఆయన అభిప్రాయపడ్డారు. మహిళల్లో ఎంతో సమర్థత, నైపుణ్యం ఉందని, కుటుంబ వ్యవహారాలు, బాధ్యత కారణంగా చాలా మంది ఇళ్లకే పరిమితం అవుతున్నారన్నారు. ఇలాంటి వారికి అవకాశాలు కల్పిస్తే ఎకనమిక్ యాక్టివిటీ పెరుగుతుందని ముఖ్యమంత్రి అన్నారు. కో-వర్కింగ్ స్పేస్ సెంటర్ల ఏర్పాటులో 2025 డిసెంబర్ చివరినాటికి 1.50 సీట్లు అందుబాటులోకి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు అధికారులు వివరించారు. ఒక్కో సీటుకు 50-60 చదరపు అడుగుల విస్తీర్ణం అవసరమని.. ప్రభుత్వ, ప్రైవేటు భవనాల్లో ఈ వర్కింగ్ సెంటర్లు ఏర్పాటు చేస్తామని అధికారులు తెలిపారు. ఇప్పటివరకు ప్రైవేటు, ప్రభుత్వ భవనాల్లో 22 లక్షల చదరపు అడుగుల స్థలాన్ని గుర్తించామని అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. రాష్ట్రంలో ప్రస్తుతం ఎంతమంది వర్క్ ఫ్రం హోమ్‌లో పనిచేస్తున్నారు, వారి అవసరాలు ఏమిటనే సమాచారం సేకరించాలని అధికారులకు సీఎం సూచించారు. అదే విధంగా ఇప్పటికే నిర్ణయించినట్లు రతన్ టాటా ఇన్నో వేషన్ హబ్‌ల ఏర్పాటుకు రాష్ట్రంలో 5 చోట్ల భవనాలను గుర్తించాలని సీఎం ఆదేశించారు. ఆ ప్రాంతంలోని పరిశ్రమలను, విద్యా సంస్థలను ఇన్నోవేషన్ హబ్‌లకు అనుసంధానం చేయాలని సీఎం నిర్దేశిరచారు.

# విద్యుత్ చార్జీలను తగ్గించే పోరులో పాల్గొని విజయవంతం చేయండి.

## -ఎమ్మెల్సీ ఇస్సాక్ బాషా. -మున్సిపల్ చైర్ పర్సన్ మా బన్నీసా.

ఆంధ్ర ప్రగతి నంద్యాల డిసెంబర్ 24:
కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఆరు నెలల కాలంలోనే ప్రజలపై విద్యుత్ భారాన్ని మోపిందని పెంచిన విద్యుత్ ఛార్జీలను తగ్గించేందుకు ప్రభుత్వాన్ని మెడలు వంచేందుకు వైఎస్ఆర్సిపి చేపడుతున్న పోరు బాటలో వైఎస్ఆర్సిపి పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు విద్యుత్ వినియోగదారులు ప్రజలు అందరూ పాల్గొని విజయవంతం చేయాలని ఎమ్మెల్సీ ఇస్సాక్ బాష, మున్సిపల్ చైర్ పర్సన్ మాబున్నీసా, వై ఎస్ ఆర్ సి పి నాయకులు పిలుపునిచ్చారు. మంగళవారం మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి నివాసంలో వైఎస్ఆర్సిపి అధినేత మాజీ ముఖ్యమంత్రి వై.యస్. జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు, ప్రజలపై విద్యుత్ చార్జీల అదనపు భారాన్ని మోపుతున్న కూటమి ప్రభుత్వ వైఖరికి నిరసనగా, డిసెంబర్ 27వ తేదీన పార్టీ శ్రేణులు, ప్రజలతో సంయుక్తంగా ర్యాలీగా వెళ్లి విద్యుత్ శాఖ కార్యాలయం లో ఆ శాఖ అధికారులకు వినతిపత్రం సమర్పిం సమర్పించే కార్యక్రమంలో భాగంగా నేడు ఎమ్మెల్సీ ఇస్సాక్ బాషా మున్సిపల్ చైర్ పర్సన్ మా బున్నీ సా, వైఎస్ఆర్ పార్టీ నాయకుల సమక్షంలో కరెంటు



చార్జీల బాదుడుపై వైయస్సార్సీపి అనే పోస్టర్ ను ఆవిష్కరణ చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ విశాఖ భాషా మున్సిపల్ చైర్ పర్సన్ మాబున్నీసా మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన ఆరు నెలల కాలంలో రెండుసార్లు విద్యుత్ చార్జీలను పెంచి విద్యుత్ వినియోగదారులపై పెను భారాన్ని మోపారన్నారు. గత వైఎస్ఆర్సిపి ప్రభుత్వం కంటే టిడిపి కూటమి ప్రభుత్వం మరింత మేళ్లను చేస్తుందన్న నమ్మకంతో ప్రజలు కూటమి ప్రభుత్వానికి అధికారాన్ని కట్టబెట్టారని, అయితే ప్రజల యొక్క నమ్మకాన్ని కూటమి ప్రభుత్వం చంద్రబాబు నాయుడు వమ్ముచేసి దగా చేశారని విమర్శించారు. కూటమి నాయకులు కల్లబొల్లి మాటలతో ప్రజలను మభ్యపెట్టి మోసం చేస్తూ రాష్ట్రాన్ని నాశనం చేస్తున్నారని, అబద్దాలతో అధికారంలో ఉండి ప్రజలపై విద్యుత్ భారాన్ని మోపారని పేర్కొన్నారు. వైఎస్ఆర్సిపి అధినేత వైయస్ జగన్మోహన్ రెడ్డి అధికారంలో ఉన్నా ..లేకున్నా..ప్రజలతో...ప్రజల కోసం ఉండే నాయకుడని, జననేత జగనన్న నాయకత్వంలో తామంతా నడుస్తున్నామని తెలిపారు. వైఎస్ఆర్సిపి అధినేత మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ఈనెల 27వ తేదీ అన్ని విద్యుత్ శాఖ కార్యాలయం ఎదుట కూటమి ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ విద్యుత్ శాఖ కార్యాలయాల వద్ద అధికారులకు వినతి పత్రాన్ని సమర్పించే కార్యక్రమాన్ని చేపడుతున్నామని తెలిపారు. ఈ పోరు బాటలో పెద్ద సంఖ్యలో వైఎస్ఆర్సిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు విద్యుత్ వినియోగదారులు, ప్రజానీకం హాజరై కూటమి ప్రభుత్వానికి తమ నిరసనను తెలియజేయాలని, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ విజయ శేఖర్ రెడ్డి, దేశం సుధాకర్ రెడ్డి, దాల్మిల్ అమీర్ ,శశికళ రెడ్డి, కౌన్సిలర్స్ విజయభాస్కర్ మేస చంద్రశేఖర్, ఆరిఫ్ నాయక్ ,చంద్రశేఖర్ రెడ్డి, వార్డు వైసిపి నాయకులు లక్ష్మీనారాయణ ,కిరణ్ కుమార్ ,జాకీర్ హుస్సేన్, సాయిరాం రెడ్డి టీవి రమణ పున్న శేషయ్య ,ఎద్దు రవి, శంకర్ నాయక్ ,ఖాసిం, టైలర్ శివ, చింతా శ్రీనివాసులు, రామచంద్రుడు, కాల్వ నాగరాజు ,సోమశేఖర్ రెడ్డి, జలీల్ ,పైలెట్ ,కైప గోపాల్ రెడ్డి, శ్రీరాములు, సుబ్బరాయుడు, తదితరులు పాల్గొన్నారు.

# బాల అకాడమీ పాఠశాల నందు ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు.

ఆంధ్ర ప్రగతి నంద్యాల డిసెంబర్ 24:
నంద్యాల పట్టణంలోని పార్క్ రోడ్డు సమీపంలో గల బాలా అకాడమీ పాఠశాలలో ముందస్తు క్రిస్మస్ వేడుకలు మంగళవారం రోజున జరుపుకోవడం జరిగింది. మంగళవారం నాడు చిన్నారులు క్రిస్మస్ వేడుకలలో భాగంగా శాంటా క్లాస్, ఏంజెల్స్,తూర్పు దేశపు జ్ఞానులు లాగా,మేరి,జోసఫ్ గొర్రెల కాపరుల వేషధారణలో వచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ ఎం. జి.వి.రవీంద్రనాథ్ ప్రిన్సిపల్ మాధవీలత మేడం గారు మాట్లాడుతూ క్రిస్మస్ పండుగలోని ముఖ్య ఉద్దేశం తెలుసుకున్నారు క్రిస్మస్ క్రైస్తవులకు ముఖ్యమైన పండుగ అని ఏసుక్రీస్తు పుట్టిన రోజులు ఈరోజు జరుపుకుంటారు ఏసు క్రైస్తవ మత మూలపురుషుడు ఈయన సాధారణంగా ఏసుక్రీస్తు గా కూడా వ్యవహరించబడతాడు ఇందులో క్రీస్తు అన్న పదం గ్రీకు భాషలో క్రీస్తోస్ అంటే అభిశక్తుడు అనే అర్థం వచ్చే పదము నుండి పుట్టింది పాపం చేసిన వాడికి శిక్ష విధించడం కాదు పాపమే మరణించాలి అలా జరిగితే పాపం లేని మనిషి పాప రహితుడై యేసు క్రీస్తులా మారతాడని దేవుని నమ్మకం అందుకే నశించిన దాన్ని వెతికే రక్షించే నిమిత్తం ఆయన తన అద్వితీయ కుమారుడైన యేసుక్రీస్తును ఈ లోకానికి పంపాడని విశ్వసిస్తారు ఏసుక్రీస్తు జన్మించినప్పుడు ఆకాశంలో ఒక నక్షత్రం వెలసింది ముగ్గురు జ్ఞానులు ఆ నక్షత్రాన్ని అనుసరించి వెళ్లి బాల యేసును దర్శించి ఆనంద భరితులయ్యారు ఆ గుర్తుగా వారు బాలయేసునకు కానుకలను సమర్పించారు అవి బంగారం గోలము, పరిమళ సాంబ్రాణి వారు సమర్పించిన బంగారం క్రీస్తు ప్రభువు పరిశుద్ధతకు పవిత్రతకు చిహ్నంగా కనబడుతుంది అందరూ ఒకరి పట్ల మరొకరు ప్రేమానురాగాలు కలిగి ఉండటం ద్వేషాన్ని విడనాడటం క్రిస్మస్ పర్వదిన ప్రాముఖ్యమని తెలిపారు క్రైస్తవ మతస్తులందరికీ మిత్రులకి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరెస్పాండెంట్ ఎం.జి.వి. రవీంద్రనాథ్ మరియు ప్రిన్సిపల్ మాధవీలత ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.




# బాల అకాడమీ పాఠశాలలో ఘనంగా జాతీయ వినియోగదారుల హక్కుల దినోత్సవం



ఆంధ్ర ప్రగతి నంద్యాల డిసెంబర్ 24:
నంద్యాల జిల్లా పార్క్ రోడ్డు సమీపంలో గల బాల అకాడమీ పాఠశాలలో డిసెంబర్ 24వ తేదీన అనగా మంగళవారం జాతీయ వినియోగదారుల హక్కుల దినోత్సవంను జరుపుకోవడం జరిగింది. ఈ కార్యక్రమానికి పాఠశాల కరస్పాండెంట్ ఎం. జి.వి. రవీంద్రనాథ్ ప్రిన్సిపల్ శ్రీమతి మాధవీలత ముఖ్య అతిథులుగా విచ్చేసి మాట్లాడుతూ వినియోగదారుల హక్కులు మరియు విధులపై అవగాహన పెంచడమే ఈరోజు ముఖ్య ఉద్దేశం గా డిసెంబర్ 24వ తేదీన జాతీయ వినియోగదారుల హక్కుల దినోత్సవం జరుపుకుంటాము వినియోగదారుల భద్రతను నిర్ధారించడానికి 1986లో వినియోగదారుల రక్షణ చట్టం రూపొందించారు అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల క రెస్పాండెంట్ ఎం.జి.వి. రవీంద్రనాథ్ ప్రిన్సిపల్ శ్రీమతి మాధవీలత పాఠశాల ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# వాటర్ షెడ్ పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్

ఆంధ్ర ప్రగతి సంజామల/నంద్యాల డిసెంబర్ 23:
భూగర్భ జలాలను పెంచడమే వాటర్ షెడ్ ముఖ్య ఉద్దేశ్యమని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి అన్నారు. మంగళవారం సంజామల మండలంలోని ఆకుమల్ల గ్రామంలో వాటర్షెడ్ పథకం కింద చేపట్టిన చెక్ డాములు, ఫారం ఫండ్స్, మినీ పర్కులేషన్ ట్యాంకులు, గార్బేజ్ స్ట్రక్చర్లు తదితర పనులను పరిశీలించారు. అనంతరం గ్రామ సచివాలయంలో వాటర్ షెడ్ కమిటీ సభ్యులతో సమావేశమై వాటర్ షెడ్ వల్ల కలిగే ప్రయోజనాలను కలెక్టర్ వివరించారు. అట్టడుగున ఉన్న భూగర్భ జలాలను పైకి తీసుకురావడానికి వాటర్ షెడ్లు ఉపయోగపడతాయన్నారు. భూమిపై పడ్డ వర్షపునీరు వృధాగా పోకుండా ప్రతి నీటి బిందువును భూమిలోకి ఇంకింప చేసి భూగర్భ జలాలను పెంచడమే వాటర్ షెడ్ ముఖ్య ఉద్దేశ్యమన్నారు. కొండలు, వాగు వంకల నుండి నీటిని సంరక్షించి నీటి నిల్వకుంటలు, పొలాల నుండి మట్టి కొట్టుకుపోకుండా అడ్డుగా రాతి కట్టలు, ఇరువైపులా మొక్కలు నాటడం, చెట్లు పెంచడం కందకాల త్రవ్వకం, ఊట కుంటలు, డగవుట్ ఫాండ్స్, ఇంకుడు గుంతలు తదితర పనులు చేపట్టి నీటిని సంరక్షించుకొని అవసరమైనప్పుడు పొలాలకు వినియోగించుకోవచ్చన్నారు. ఉపాధి హామీ కింద చేపట్టే పనులు కమిటీ సభ్యుల ఆమోదంతో ప్రతిపాదనలు పంపాలన్నారు. జిల్లాలో ఇంకా 20లక్షల పని దినాలను ఉపాధి వేతనదారులకు



కల్పించాల్సి ఉందని... సంజామల మండలంలో ఉపాధి పనులకు ఎక్కువగా అవకాశాలు ఉన్నాయని వేతన దారులను మోటివేట్ చేసి లేబర్ బడ్జెట్ ను పెంచాలని ఏపీఓ, ఎంపీడీఓలను కలెక్టర్ ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వం ఉపాధి వేతన దారుడికి రోజుకు 300 రూపాయలు అందిస్తోందని అయితే ఈ జిల్లాలో రోజుకు 245 రూపాయల కూలి మాత్రమే చెల్లిస్తున్నారన్నారు. లేబర్ బడ్జెట్ ఎంత పెరిగితే అంత మెటీరియల్ కాంపోనెంట్ వస్తుందని ఆ నిధులతో గ్రామాల్లో సిసి రోడ్లు, డ్రైన్లు ఇతర అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టే అవకాశం ఉంటుందని కలెక్టర్ తెలిపారు. అనంతరం సచివాలయ సిబ్బందితో కలెక్టర్ మాట్లాడుతూ సమయపాలన పాటించడంతోపాటు నిర్దేశించిన పనులు నిర్ణీత కాలవ్యవధిలోగా పూర్తి చేయాలని ఆదేశించారు.హౌస్ హెూల్డ్ సర్వే, జియో ట్యాగింగ్ తదితర అంశాలపై కలెక్టర్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. సచివాలయ



ముందుభాగంలో పారిశుద్ధ్యం సరిగ్గా లేకపోవడంతో అసంతృప్తి వ్యక్తం చేస్తూ సచివాలయంతో పాటు పరిసర ప్రాంతాలను కూడ పరిశుభ్రంగా ఉంచుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రజలకు వివిధ సంక్షేమ కార్యక్రమాల పట్ల అవగాహన కల్పించాలన్నారు. సోలార్ ఇంజన్లు తదితర వాడకాలపై నిర్దిష్టమైన సూచనలు జారీ చేయాలన్నారు. సచివాలయంలో టాయిలెట్ నిర్మాణానికి సర్పంచ్ సహకారం తీసుకొని ఏర్పాటు చేయించాల్సిందిగా పంచాయితీ సెక్రటరీని కలెక్టర్ ఆదేశించారు. రెవెన్యూ సదస్సుల నిర్వహణపై విఆర్ఓ, సర్వేయర్లతో మాట్లాడుతూ ఫిర్యాదులను ఎప్పటికప్పుడు ఆన్లైన్లో నమోదు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. డ్వామా పిడి జనార్దన్ రెడ్డి, వాటర్ షెడ్ అడిషనల్ పిడి మాధవీలత, ప్రాజెక్ట్ ఆఫీసర్ విజేత, గ్రామ సర్పంచ్, ఎంపీడిఓ,ఏపీడి, ఎపిఓ తదితరులు కలెక్టర్ వెంట పాల్గొన్నారు.

# శ్రీ సంకల్ప్ ఒలంపియాడ్ పాఠశాల నందు ఘనంగా క్రిస్మస్ వేడుకలు



ఆంధ్ర ప్రగతిని నంద్యాల డిసెంబర్ 24: నంద్యాల పట్టణం సంజీవనగర్ నందలి శ్రీ సంకల్ప్ ఒలింపియాడ్ పాఠశాల నందు మంగళవారం ముందస్తుగా 'క్రిస్మస్ వేడుకలు' నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థినీ విద్యార్థులు క్రిస్మస్ వేడుకలకు సంబంధించిన వస్త్రధారణలతో అందరినీ అలరించారు. ఈ యొక్క వేడుకలకు పాఠశాల కరస్పాండెంట్ శ్రీ సుధాకర్ ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా శ్రీ సుధాకర్ మాట్లాడుతూ క్రిస్మస్ పండుగ ఏసుక్రీస్తు జననానికి గుర్తుగా జరుపుకునే పండుగని, క్రీస్తు జన్మదినాన్ని పురస్కరించుకొని ప్రపంచంలో అత్యంత విస్తృతంగా జరుపుకునే వేడుకల్లో క్రిస్మస్ ఒకటని తెలియజేశారు. ఇది ప్రేమ మరియు కరుణకు ప్రతీక అని తెలియజేస్తూ ఒకరికొకరు సహాయం చేసుకోవడం, బహుమతులు ఇచ్చి పుచ్చుకోవడం ఈ పండుగ ప్రత్యేకత అని తెలియజేశారు. ఈ వేడుకల్లో భాగంగా పాఠశాల నందు స్టార్స్ ఏర్పాటు, క్రీస్తు జననమునకు సంబంధించిన పలు సన్నివేశాలను ఏర్పాటు చేయటం జరిగింది. అంతేకాక పాఠశాల నందు విద్యార్థులు క్రిస్మస్ వేడుకకు సంబంధించి పలు సాంస్కృతిక కార్యక్రమాలను కూడా నిర్వహించారు. ఈ వేడుకలో పాఠశాల తల్లిదండ్రులు, అధ్యాపక బృందం పాల్గొన్నారు.







# వడ్డెర్ల ఐక్యతతోనే హక్కుల సాధన

## ఆంధ్రప్రదేశ్ వడ్డెర సంఘం రాష్ట్ర అధ్యక్షులు బత్తుల లక్ష్మీకాంతయ్య.

ఆంధ్ర ప్రగతి గోస్పాడు, డిసెంబర్ 24:
వడ్డెరులు ఐక్యతతోనే హక్కులను సాధించుకోవాలని ఆంధ్రప్రదేశ్ వడ్డెర సంఘం రాష్ట్ర అధ్యక్షులు బత్తుల లక్ష్మీకాంతయ్య అన్నారు. మంగళవారం గోస్పాడు మండలం యాళ్ళూరు గ్రామంలో వడ్డెర్ల ఆత్మీయ సమ్మేళనానికి “ముఖ్యఅతిథులుగా ఆంధ్రప్రదేశ్ వడ్డెర సంఘం రాష్ట్ర అధ్యక్షులు బత్తుల లక్ష్మీకాంతయ్య, ఏపీ వడ్డెర కార్పోరేషన్ డైరెక్టర్, నంద్యాల జిల్లా అధ్యక్షులు ఓర్సు రామసుబ్బయ్య, రాష్ట్ర కార్యదర్శి జిల్లా వెంకటేశ్వర్లు” హాజరయ్యారు. గ్రామాల్లో యాళ్ళూరు వడ్డెర సంఘం ఆధ్వర్యంలో గ్రామ పురవీధుల గుండా వడ్డెరులను ఎస్టి జాబితాలో చేర్చాలని కోరుతూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ వడ్డెర సంఘం రాష్ట్ర అధ్యక్షులు బత్తుల లక్ష్మీకాంతయ్య మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం తక్షణమే ఎన్నికల సమయంలో వడ్డెరులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. వడ్డెరులను ఎస్టీ జాబితాలో చేర్చాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. స్వాతంత్ర సమరయోధుడు వడ్డే ఓబన్న జయంతిని జనవరి 11న అధికారికంగా నిర్వహించేందుకు తక్షణమే కూటమి ప్రభుత్వం జీవోను జారీ చేయాలని సూచించారు. క్వారీల్లో పనిచేసే వడ్డెర కార్మికులకు ప్రమాదవశాత్తు మరణిస్తే 25 లక్షల ఎక్స్ గ్రేషియా చెల్లించాలని కోరారు. 50 ఏళ్లు నిండిన వడ్డెర కార్మికులకు సామాజిక భద్రత పెన్షన్ మంజూరు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. వడ్డెర్లు రాజ్యాధికారం దిశగా అడుగులు వేయాలని తెలిపారు. అంతేకాకుండా గ్రామాల్లో వడ్డెరులు పిల్లలను విద్యావంతులుగా తీర్చిదిద్దాలని సూచించారు. ఐక్యమత్యంతోనే వడ్డెర్లు అన్ని





విధాలుగా అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతారని పేర్కొన్నారు. యాళ్ళూరు వడ్డెర సంఘం యువ నాయకుల కృషి అభినందనీయమని అన్నారు. ప్రతి గ్రామంలో స్వాతంత్ర సమరయోధులు వడ్డే ఓబన్న విగ్రహాలను ఏర్పాటు చేసి ఓబన్న స్ఫూర్తితోనే ఉద్యమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు.వడ్డెర్ల హామీలను విస్మరిస్తే పాలక ప్రభుత్వాలకు పుట్టగతులు ఉండవని హెచ్చరించారు. వడ్డెర్లకు మైనింగ్ లో ప్రత్యేక రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వడ్డెర సంఘం నాయకులు గోగుల వెంకటేశ్వర్లు, ఇరగదిండ్ల లక్ష్మన్న, యాలూరు వడ్డెర సంఘం అధ్యక్షులు మంజుల రామచంద్రుడు, ఉపాధ్యక్షులు గోగుల సుబ్బు, నాయకులు గోగుల వెంకటేశ్వర్లు, ఇరగదిండ్ల మహేష్ ,గోగుల వెంకటసుబ్బయ్య చిన్న వీరయ్య ,సుధాకర్, మంజుల వెంకటరాముడు, చల్లా సుధాకర్ చల్ల రమణ, సురేష్, శివ, రమణ ,వెంకటేశ్వర్లు, చైతన్య తదితరులు పాల్గొన్నారు.

# ముస్లిం సమాజాన్ని ఆదుకునేది టిడిపినే.!

## -ఎపి మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ మౌలానా ముస్తాక్ అహ్మద్



ఆంధ్ర ప్రగతి అమరావతి డిసెంబర్ 24:
ముస్లిం సమాజాన్ని ఆదుకునేది తెలుగు దేశం పార్టీయేనని ఎపి మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ మౌలానా ముస్తాక్ అహ్మద్ పేర్కొన్నారు. నంద్యాల బస్టాండ్ ఎదురుగా ఉన్న అంజుమన్ షాదీఖానాలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్, తెలుగు దేశం పార్టీ మైనారిటీ సెల్ అధ్యక్షులు మౌలానా షేక్ ముస్తాక్ అహ్మద్ ను మౌలానాలు హృదయ పూర్వకంగా ఆహ్వానించి సన్మానం చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మౌలానా ముస్తాక్ అహ్మద్ మాట్లాడుతూ ముస్లిం మైనార్టీలకు అన్ని విధాల ఆదుకుంటుందన్నారు సూపర్ సిక్స్ పథకాలను కచ్చితంగా కూటమి ప్రభుత్వం అమలు చేస్తుందని పేర్కొన్నారు. మసీదులకు మరమ్మతుల కోసం అలాగే మౌజాన్, పేష మాములకు జీతభత్యాలు ఇస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంల్ మొహమ్మద్ ఈసుబ్, మౌలానా హుస్సేన్ (రషాది), మౌలానా అయూబ్, అబ్దుల్ వహీద్ హాఫీజాబ్, రిటైర్డ్ హెడ్ మాస్టర్ బియబాని, బిల్డర్ అబ్దుల్లా, టిడిపి రాష్ట్ర మైనారిటీ కార్యదర్శిలు ఫరీద్, రషీద్, నంద్యాల జిల్లా అధికార ప్రతినిధి అమీర్తదితరులు పాల్గొన్నారు.

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక


# మంత్రి ఫరూక్ కు కృతజ్ఞతలు తెలిపిన ట్రాన్స్ జెండర్స్




ఆంధ్ర ప్రగతి నంద్యాల డిసెంబర్ 24:
నంద్యాల పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయం నందు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ ని ఇండియన్ నేషనల్ సమతా హైజాదస్ ఐక్య పోరాట సమితి నాయకులు పిడేసేలా విజయ్ కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా మంత్రి ఫరూక్ ను , నంద్యాల టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ ని సన్మానించుకొని కృతజ్ఞతలు తెలుపడం జరిగింది.
ఈ సందర్భంగా మంత్రి ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ ట్రాన్స్ జెండర్స్ ను అన్ని విధాలుగా తెలుగుదేశం పార్టీ అండదండలుగా ఉంటుందని గతంలో తెలుగుదేశం పార్టీ హయాంలో ఇళ్లస్థలాలు ఇవ్వడం జరిగిందని అలాగే ఇప్పుడు కూడా ఇళ్ల స్థలాలు ఇచ్చి ఇంటి నిర్మాణానికి హౌసింగ్ ద్వారా లోన్లు ఇప్పిస్తామని అదేవిధంగా వారికి కావాల్సిన అన్ని సదుపాయాలను ఏర్పాటు చేస్తామని ఏ ప్రభుత్వం చేయని విధంగా ట్రాన్స్ జెండర్స్ కు 4000 పింఛన్ ఇచ్చిన ఘనత తెలుగుదేశం పార్టీకే చెందుతుందని తెలిపారు. అలాగే భవిష్యత్తులో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తో మాట్లాడి తెలంగాణ రాష్ట్రంలో ఏ విధంగా అయితే ట్రాన్స్ జెండర్స్ కు ట్రాఫిక్ కానిస్టేబుల్ పోస్టులు ఇచ్చారు అదేవిధంగా ఆంధ్రప్రదేశ్ లో కూడా ప్రభుత్వ ఉద్యోగాలు వచ్చే విధంగా వారితో చర్చిస్తామని తెలిపారు.



ఈ కార్యక్రమంలో ట్రాన్స్ జెండర్స్ పార్వతమ్మ , ఉమా, షేక్ బాషా, చల్ల గీత, గౌరమ్మ వెలుగోడు అనిత , షేక్ ఉస్మాన్ చార్మి , షేక్ మౌలాలి , సారధి, పూజ, షేక్ లింగాపురం మౌలాలి, లోకేష్ గౌడ్, అమ్ములు, గంగ , స్వప్న, కే నీలిమ, డి సరోజమ్మ తదితరులు పాల్గొన్నారు.

# రామాయణం జగతికి ఆదర్శం.



ఆంధ్ర ప్రగతి నంద్యాల డిసెంబర్ 24:
సమస్త మానవాళిని సన్మార్గంలో నడిపించడానికి, మానవత్వపు పరిమళాలు వెదజల్లే శ్రీమద్రామాయణం ఈ జాతి ఉన్నంతవరకు ఆదర్శంగానే నిలుస్తుందని తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్తు ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వేంకటరెడ్డి అన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ ఆధ్వర్యంలో పత్తికొండ పట్టణంలోని శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానం నందు ధార్మిక కార్యక్రమాల ప్రారంభోత్సవ సందర్భంగా వారు ప్రారంభోపన్యాసం చేశారు. తదనంతరం ప్రముఖ రంగస్థల కళాకారుడు పాయసం పెద్ద రంగారెడ్డి చేసిన సంగీత భరిత ధార్మిక ప్రవచనం భక్తులను ఎంతగానో అలరించినది. ఈ కార్యక్రమంలో శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానం చైర్మన్ అమరావతి శ్రీనివాస్, విశ్వహిందూ పరిషత్ ప్రఖండ అధ్యక్షులు వీరరాజు, ఆర్ ఎస్ ఎస్ ప్రముఖ్ రామలింగయ్య, జి.వేంకటేశ్వర్లు, విష్ణు సహస్రనామ బృందం అధ్యక్షులు విజయలక్ష్మీ , కురువ గిడ్డయ్యతో పాటు స్థానిక భక్తులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణకై జనవరి వేడుకలను పూల మొక్కలతో జరుపుకుందాం

**-రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఫరూక్.**



ఆంధ్రప్రగతి నంద్యాల డిసెంబర్ 24:
రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో ముద్రించిన "జనవరి వేడుకలను పూల మొక్కలతో జరుపుకుందాం" అనే బ్యానర్లను రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ ఆవిష్కరించారు. జనవరి శుభాకాంక్షలు తెలియజేయడానికి విచ్చేసే తన అభిమానులు, కార్యకర్తలు శ్రేయోభిలాషులు అందరూ స్వీట్స్, పూలదండలు, బొకేలు కాకుండా పూల మొక్కలతో, నోటు పుస్తకాలతో శుభాకాంక్షలు తెలియజేయాలని మంత్రి ఫరూక్ సూచించారు. రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో పూల మొక్కలతో, నోటు పుస్తకాలతో జనవరి వేడుకలు జరుపుకుందామని ఏర్పాటుచేసిన బ్యానర్లను ఆవిష్కరించే కార్యక్రమంలో మంత్రి ఫారుక్ తో పాటు పాల్గొన్న తెలుగుదేశం నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ మాట్లాడుతూ మన నంద్యాల పట్టణంలో ప్రతి ఒక్కరం పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని, జనవరి ఒకటో తారీఖున ప్రతి ఒక్కరం ఒక మొక్క నాటాలని పిలుపునిచ్చారు. ఈ విషయంలో రెడ్ క్రాస్ సంస్థ చాలా సంవత్సరాలుగా కృషి చేస్తుందని, మరియొకసారి జిల్లా ప్రజలందరికీ ఈ విషయమై అవగాహన కల్పిస్తున్న రెడ్ క్రాస్ వారికి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ నంద్యాల జిల్లా చైర్మన్ దస్తగిరి పర్ల, వైస్ చైర్మన్ మారుతి కుమార్, జిల్లా కార్యవర్గ సభ్యుడు ఉస్మాన్ భాష, ఆర్గాన్ డొనేషన్ మోటివేషన్ కోఆర్డినేటర్ ఆనంద్ గురూజీ, రెడ్ క్రాస్ జిల్లా కోఆర్డినేటర్ అబ్దుల్ సమీ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ కార్యాలయాలను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా



ఆంధ్ర ప్రగతి నంద్యాల డిసెంబర్ 24:
జిల్లా కేంద్రంలోని పలు ప్రభుత్వ కార్యాలయాలను జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి తనిఖీ చేశారు. మంగళవారం సాయంత్రం నంద్యాల పట్టణం పొన్నాపురం కాలనీలో వున్న డివిజనల్ పంచాయతీ కార్యాలయం, సచివాలయం 2, అంబేద్కర్ భవన్, సాంఘిక సంక్షేమ కార్యాలయం, చంటి పిల్లల ప్రత్యేక దత్తత కేంద్రాలను పరిశీలిస్తూ సిబ్బంది, కార్యకలాపాల పనితీరుపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యాలయాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు కార్యాలయాల్లోని చుట్టుపక్కల ప్రదేశాలు దురాక్రమణలకు గురికాకుండా పరిరక్షించుకోవాలన్నారు. చంటి పిల్లల ప్రత్యేక దత్తత కేంద్రాన్ని చక్కగా, పరిశుభ్రంగా ఉంచుకున్నారని కలెక్టర్ ప్రశంసించారు. చంటి పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడంతో పాటు పిల్లలను బాగా చూసుకోవాలని సిబ్బందిని కలెక్టర్ ఆదేశించారు.

## మట్కా నియంత్రనే లక్షంగా ముమ్మర తనిఖీలు

**-ఇద్దరు వ్యక్తులు అరెస్టు...1,02,070 /- రూపాయలను స్వాధీనం చేసుకున్న త్రీ టౌన్ పోలీసులు.**

**-త్రీ టౌన్ ఇన్స్పెక్టర్ సూర్య మౌళి.**




ఆంధ్ర ప్రగతి నంద్యాల జిల్లా డిసెంబర్ 24:
నంద్యాల జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఆదేశాలమేరకు జిల్లాలో అసాంఘిక కార్యకలాపాల నియంత్రణలో భాగంగా మట్కాజూదం మొదలగునవి నియంత్రించుటకు నంద్యాల 3 టౌన్ ఇన్స్పెక్టర్ సూర్య మౌళి మరియు ఎస్సై సత్యనారాయణ వారి సిబ్బంది సహాయంతో విశ్రుత తనిఖీలు చేయుచుండగా నంద్యాల టౌన్ నూనెపల్లి జిలేబి సెంటర్ వద్ద ఇద్దరు వ్యక్తులు మట్కా ఆడుటకు ప్రజలను ప్రేరేపించి వారి వద్ద నుండి డబ్బులు వసూలు చేయు చేయుచుండగా వారిని పట్టుకుని అరెస్ట్ చేసి వారి వద్ద నుండి మట్కాకు సంబందించిన చీటీలను 1,02,070 /- (అక్షరాల ఒక లక్ష రెండు వేల డెబ్బై )రూపాయలను తదుపరిచర్య నిమిత్తం స్వాదినం చేసుకోవడమైనది.
1) షేక్ జమాల్ బాష S/o షేక్ మహమ్మద్ ముస్తఫా, వయస్సు 24 సంవత్సరములు r/o కొలిమిపేట, నూనెపల్లి నంద్యాల టౌన్. 2) బొగ్గ నాగేంద్రుడు ఏ చిన్న S/o బాలుడు , వయసు 39 బుక్కపురం, తిమ్మాపురం, మహానంది మండలం .. మట్కాకు సంబందించిన చీటీలను మరియు 1,02,070/–రూపాయల నగదు ఈ సందర్భంగా త్రీ టౌన్ ఇన్స్పెక్టర్ సూర్యమౌళి గారు మాట్లాడుతూ ఎవరైన ప్రజలకు అధిక డబ్బులు వస్తాయని ఆశ చూపించి పేద ప్రజల జీవితాలను మట్కా అనే జూదం వైపు మరల్చి వారి జీవితాలను నాశనం చేయుటకు పాల్పడిన అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలియజేశారు.

# రామకృష్ణ డిగ్రీ కళాశాల ఎన్. సి. సి. క్యాడేట్స్ కు అభినందన సభ

**-దివ్యాంగుల దినోత్సవం రోజు ఎన్.సి.సి.విద్యార్థుల సేవలు విశిష్టమైనవి.**




ఆంధ్ర ప్రగతి నంద్యాల డిసెంబర్ 24:
నంద్యాల దివ్యాంగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం రామకృష్ణ డిగ్రీ కళాశాల వివేకానంద ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమంలో, ఈనెల టౌన్ హాల్ లో నిర్వహించిన ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం రోజు దివ్యాంగులకు విశిష్ట సేవలందించిన రామకృష్ణ డిగ్రీ కళాశాల ఎన్.సి.సి క్యాడేట్స్ ను అభినందించి బహుమతులు అందజేశారు. నంద్యాల దివ్యాంగుల సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షులు డాక్టర్ జి. రవికృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రామకృష్ణ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ జి. రామకృష్ణారెడ్డి, ప్రముఖ న్యాయవాది, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి వెదుర్ల రామచంద్రరావు, రోటరీ మాజీ గవర్నర్ కందుకూరి శ్రీరామ్మూర్తి, ప్రముఖ వైద్యులు డాక్టర్ విజయబాబు, సీనియర్ లయన్స్ క్లబ్ సభ్యులు మహేశ్వర్ రెడ్డి పాల్గొని విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రవి కృష్ణ మాట్లాడుతూ దాతల సహకారంతో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం రోజున ప్రతి ఏటా భారీ సేవా కార్యక్రమాలను చేస్తున్నామని అయితే వాటిని ఆరోజు దివ్యాంగులకు అందించడంలో, అదేవిధంగా దివ్యాంగులకు ఆ కార్యక్రమంలో విశిష్ట సేవలు అందించిన రామకృష్ణ డిగ్రీ కళాశాల ఎన్.సి.సి. క్యాడేట్స్ సేవలు ప్రశంసనీయమని అన్నారు. డాక్టర్ రామకృష్ణారెడ్డి,వెదుర్ల రామచంద్రరావు, కందుకూరి శ్రీరామమూర్తి ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఏటా దివ్యాంగులకు ప్రపంచ దివ్యాంగుల దినోత్సవ సేవా కార్యక్రమాలు నిర్వహించడమే కాకుండా దివ్యాంగులకు నిరంతరం తమ కార్యాలయం ద్వారా సహకరిస్తున్న దివ్యాంగుల సంక్షేమ సంఘం సేవలు మరువ లేమన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ విజయబాబు,లయన్స్ క్లబ్ సీనియర్ సభ్యులు మహేశ్వరరెడ్డి ,లయన్స్ క్లబ్ అధ్యక్షులు నిజాముద్దీన్, కార్యదర్శి శిరిగిరి రమేష్, ఉపాధ్యక్షులు సోమేశుల నాగరాజు, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

# పోరాట యోధులు పెరియార్ రామస్వామి వర్ధంతి వేడుకలు.




ఆంధ్రప్రగతి నంద్యాల డిసెంబర్ 24:
ఆత్మగౌరవ పోరాట యోధులు పెరియార్ రామస్వామి అని పట్నం రాజేశ్వరి అన్నారు. కర్నూలు నందలి స్థానిక బి క్యాంపులో గల యస్సీ యస్టీ బిసి మైనార్టీ మహిళా ఐక్య వేదిక జిల్లా కార్యాలయంలో పెరియార్ రామస్వామి 51వ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. పెరియార్ రామస్వామి చిత్రపటానికి యస్సీ యస్టీ బిసి మైనార్టీ మహిళా ఐక్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షురాలు పట్నం రాజేశ్వరి, రాష్ట్ర అధ్యక్షురాలు నంది విజయలక్ష్మీ, జిల్లా అధ్యక్షురాలు పాలెం రాధ లు పూలమాల వేసి నివాళులు అర్పించడం జరిగింది. ఈ సందర్భంగా నంది విజయలక్ష్మి మాట్లాడుతూ పెరియార్ నాస్తికవాది మరియు సంఘసంస్కర్త అని, తమిళనాడులోని ఆత్మగౌరవ ఉద్యమం, ద్రవిడ ఉద్యమములకు ఉద్యమ నిర్మాత అని వారు తెలిపారు. దక్షిణ భారతీయులను రాక్షసులుగా వానరులుగా చిత్రీకరించిన రామాయణాన్ని,రాముడ్ని పెరియార్ తీవ్రంగా విమర్శించారని వారు చెప్పారు. హిందూమతాన్ని అందులోని కుల వ్యవస్థను పెరియార్ అస్యహించు కున్నారని, మరీ ముఖ్యంగా బ్రాహ్మణ వర్గాన్ని తీవ్రంగా ద్వేషించారని వారు అన్నారు. కాంగ్రెస్ పార్టీలో ఉండి దేశ స్వాతంత్రం కోసం పోరాడారని, ఆ తర్వాత కాలంలో పెరియార్ అతని అనుచరులు దేశ స్వాతంత్ర్యం కన్నా సాంఘిక సమానత్వం కొరకు ఎక్కువగా పోరాడారు. అన్ని కులాల వారికి సమానంగా దేవాలయ ప్రవేశ అర్హత కల్పించేందుకు పెరియార్ పోరాడారని వారు తెలిపారు. ఆ తర్వాత కాంగ్రెస్ పార్టీ నుండి బయటకి వచ్చి జస్టిస్ పార్టీ పెట్టి తన పార్టీ తరుపున హిందూ వ్యతిరేక ఉద్యమాన్ని పెద్ద ఎత్తున చేపట్టి చివరకి హింది బోధనను విరమింప చేశాడని, తదనంతరం పార్లమెంటరీ రాజకీయాల మీద విశ్వాసం కోల్పోయి జస్టిస్ పార్టీని "ద్రవిడ కజగం" అనే సామాజికోద్యమ సంస్థగా పెరియార్ మార్చారని వారు అన్నారు. ద్రవిడ కజగం నుండే ద్రవిడ మున్నేట్ర కజగం పార్టీ పుట్టడం దాని నుండి అఖిల భారత అన్నా ద్రవిడ మున్నేట్ర కజగం పార్టీ పుట్టడం జరిగిందని ఈ రెండు పార్టీలే ఆనాటి నుండి ఈనాటి వరకు తమిళనాడు రాజకీయలను శాసిస్తున్నాయని వారు తెలిపారు. సాంఘిక సామాజిక సమానత్వం కోసం మూఢ నమ్మకాలకు వ్యతిరేకంగా మరియు ఆత్మగౌరవం కోసం అలుపెరుగని పోరాటం చేసిన పెరియార్ రామస్వామి 1973 వ సంవత్సరం డిసెంబరు 24 న మరణించారని, పెరియార్ ఆశయాలను ముందు తీసుకెళ్ల గలిగినప్పుడే ఆయనకు నిజమైన నివాళి అర్పించిన వారము అవుతామని వారు తెలిపారు. జిల్లా ఉపాధ్యక్షురాలు హుసేన్ బీ, లక్ష్మేశ్వరీ తదితరులు పాల్గొన్నారు.

## వైసీపీ పోరుబాట పోస్టర్ ఆవిష్కరణ

అమరావతి, డిసెంబర్ 24ఆంధ్రప్రగతి: రాష్ట్రంలో కరెంటు చార్జీలు పెంపుపై వైఎస్సార్సీపీ పోరుబాట పోస్టర్‌ను మంగళవారం విడుదల చేశారు. ఉత్తరాంధ్ర రీజనల్ కోఆర్డినేటర్ విజయసాయిరెడ్డి, గుడివాడ అమర్నాథ్, బూడి ముత్యాల నాయుడు పార్టీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ముఖ్య నాయకులు ఈ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా విజయసాయిరెడ్డి మాట్లాడుతూ.. 44 సంవత్సరాల అనుభవాన్ని ప్రజలను మోసం చేయడానికి ఉపయోగిస్తున్నారని మండిపడ్డారు. పెరిగిన విద్యుత్ ఛార్జీలకు నిరసనగా 27వ తేదీన నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. "మేము ఎన్డీఏ పక్షం కాదు, ఇండియా పక్షం కాదు. మేము మొదటి నుంచి న్యూట్రల్‌గానే ఉన్నాం. రాష్ట్ర ప్రయోజనాలే మాకు ముఖ్యం. మేము మొదటి నుంచి చెప్తున్నం జెమిలి ఎన్నికలు వస్తాయని. జేపీసీలో నేను కూడా ఒక సభ్యుడిని. జేపీసీ ప్రతి రాష్ట్రంలోని పర్యటిస్తుంది. ప్రతి రాజకీయ పార్టీని కలుస్తుంది. జేపీసీకి పార్టీ వైఖరిని వైఎస్ జగన్ స్పష్టం చేస్తారు" అని విజయసాయిరెడ్డి వెల్లడించారు. పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ పిలుపు మేరకు ఈ నెల 27వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు చేపట్టనున్నట్లు మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ తెలిపారు. ఎన్నికలకు ముందు విద్యుత్ ఛార్జీలు రూపాయి కూడా పెంచమని హామీ ఇచ్చారని.. అయితే అధికారంలోకి వచ్చిన తర్వాత పెద్ద ఎత్తున విద్యుత్ ఛార్జీలు పెంచారని మండిపడ్డారు. అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే 15 వేల కోట్లకు పైగా భారాన్ని మోపారన్నారు. వైఎస్ జగన్ ఆదేశాల మేరకు ప్రజల పక్షాన పోరాటం చేస్తామన్నారు. వచ్చే నెల నుంచి రూపాయిన్నర వరకు యూనిట్‌పై భారం పడుతుందన్నారు. ఆరు నెలల కాలంలో 75 వేల కోట్ల రూపాయలు అప్పు చేశారని.. సంక్షేమానికి ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయలేదని విమర్శించారు. నాణ్యమైన విద్యుత్తు, విద్య, వైద్యాన్ని అందిస్తామని చెప్పి నాణ్యమైన మద్యాన్ని అందజేస్తున్నారంటూ మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ వ్యాఖ్యలు చేశారు.

## విజయవాడ కోర్టుకు తెలంగాణ,ఏపీ ప్రజాప్రతినిధులు



అమరావతి,డిసెంబర్ 24 ఆంధ్రప్రగతి: తెలంగాణ ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ప్రజాప్రతినిధులు మంగళవారం విజయవాడ కోర్టుకు హాజరయ్యారు. 2007లో ఓబులాపురం మైనింగ్ పరిశీలనకు వెళ్లిన 21 మంది నేతలపై కేసు నమోదు అయిన విషయం తెలిసిందే. ఈ కేసుకు సంబంధించి విజయవాడ ప్రజాప్రతినిధుల ప్రాతినిధ్యం కోర్టుకు నేతలు ఈరోజు హాజరయ్యారు. మొత్తం 21 మందిపై కేసు నమోదు అవగా.. వీరిలో ముగ్గురు మరణించారు. మిగిలిన వారిని తప్పనిసరిగా కోర్టుకు హాజరు కావాలంటూ స్పెషల్ కోర్టు న్యాయమూర్తి ఆదేశాలు జారీ చేశారు. దీంతో న్యాయమూర్తి ఆదేశాల మేరకు మంత్రి అచ్చెన్నాయుడు, మాజీ మంత్రి నాగం జనార్ధన్ రెడ్డి, దేవినేని ఉమా, నిమ్మకాయల చినరాజప్ప, ఎర్రబెల్లి దయాకర్, అమర్నాథ్ రెడ్డి, ప్రజా ప్రతినిధులు బాబు రాజేంద్రప్రసాద్, కోళ్ల లలిత కుమారి, పొలం నాగరాజు, చిన్నబాబు రమేష్, గురుమూర్తి కోర్టుకు హాజరయ్యారు. మరోవైపు విజయవాడ కోర్టు ఆవరణలో ఆంధ్ర తెలంగాణ నేతల కలయికతో సందడి నెలకొంది. ఒకప్పుడు అంతా తెలుగుదేశంలో ఉండి వేరే పార్టీలు మారిన తెలంగాణ నేతలు.. పాత మిత్రులతో ఆత్మీయ సంభాషణ జరిపారు.